ప్రజల వద్దకు పాలన జగనన్నతోనే సాధ్యం


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రజల వద్దకే పాలన రావాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులు రెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని ఇప్పపెంట, పాపాసాహెబ్‌పేట పంచాయతీల్లోని గ్రామ సచివాలయాలతో పాటు, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను వారు ప్రారంభించి మాట్లాడారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కావాలన్నా, పింఛన్ కావాలన్నా ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ, ఎంపీడీవో కార్యాలయం చుట్టూ, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగేవారన్నారు. ప్రస్తుతం జగనన్న పరిపాలన వచ్చిన తర్వాత జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ప్రతి కుటుంబానికి దగ్గరుండి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనందరం ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ కొత్తపల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ నారీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో గతానికి ఇప్పటికి తేడాను గమనించండి

కొండాపురం : చంద్రబాబు పాలనకు జగనన్న పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం కొండాపురంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి గతంలో చంద్రబాబు పరిపాలనలో సంక్షేమపథకాలు ఏమాత్రం అమలు చేశాడో మీకుతెలుసు అన్నారు. ఇప్పుడు జగనన్న సంక్షేమ పథకాలు ఏవిధంగా అమలు చేస్తున్నాడో చుస్తున్నారని దీనిని బట్టి ఎవరి పరిపాలన ఏవిధంగా ఉందో మీరే పరిశీలించాలన్నారు. జగనన్న పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే మనం ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. లేకపోతే మళ్లి జన్మభూమి కమిటీలు వస్తాయని వారు చేసిన అరాచకాలు ఎలాంటివో మళ్లి తాను చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలు మీ ముందుకు టీడీపీ నాయకులు మాయ మాటలు చెప్పి తీసుకువస్తారని మిమ్మల్ని మభ్యపెడతారని ఎవరూ మోసపోకండని ప్రజలకు ఆయన వివరించారు. అనంతరం కొండాపురంలో ముస్లింలకోసం నూతన మసీదు, ప్రహరీగోడ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింతరాజారెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, కొండా వాసుదేవ రెడ్డి, బుజ్జి, బాబుల్‌రెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షుడు ఖాదర్‌బాషా, రామాంజనేయులురెడ్డి, కృష్ణయ్య, ప్రవీణ్‌యాదవ్, చోటు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జమ్మలమడుగు : పట్టణంలోని 8వ వార్డులో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జఫ్రుల్లా

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వైఎస్సార్ జిల్లా, కడప నగరానికి చెందిన షేక్ జఫ్రుల్లా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీచేశారు. అల్మాస్‌పేటకు చెందిన జఫ్రుల్లా కాంగ్రెస్ పార్టీలో జిల్లా మైనార్టీ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీని వీడి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత జఫ్రుల్లా జిల్లా జాయింట్ సెక్రటరీగా కొనసాగుతున్నారు.

క్లుప్తంగా

నూతన చర్చి ప్రారంభం


నూతన చర్చిని ప్రారంభిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో నూతనగా నిర్మించిన చర్చిని గురువారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు రాయలసీమ బిషప్ ఐజాక్ వరప్రసాద్, సీఎస్ఐ చర్చి ఫాదర్ ఆనందరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

పులివెందుల రూరల్ : పట్టణంలోని క్రిష్టియన్ లైన్ నగరిగుట్టలో కోలా ప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చేసేందుకు గురువారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ భూమిపూజ చేసి అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. నగరిగుట్టలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అశోక్ తన స్థలం ఇవ్వడం సంతోషకరమన్నారు. క్రిష్టియన్‌లైన్‌లో అందరూ కలిసికట్టుగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కోలా యువసేన కమిటీ సభ్యులు, క్రిష్టియన్‌లైన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు

ఎర్రగుంట్ల : మండల తాహీసల్దార్ కార్యాలయంలో బదిలీ అయిన తహీసల్దార్ ఎ నాగేశ్వర రావుకు గురువారం రెవెన్యూ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఇక్కడ నాలుగు సంవత్సరాలుగా పనిచేసిన ఆయన తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డీటీలు, ఆర్ఐలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ముద్దనూరు సీఐగా దస్తగిరి



ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసుగా కె.దస్తగిరి గురువారం బాధ్యతలు చేపట్టారు. కడప వీఆర్‌లో వున్న దస్తగిరిని ఉన్నతాధికారులు ముద్దనూరు యూజీ స్టేషన్‌కు సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది మార్చినెలలో విధుల్లో చేరిన సీఐ నరేష్ బాబు అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్ళారు.

రేపు టెక్‌వేవ్-2024 సాంకేతిక ప్రదర్శన

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం టెక్‌వేవ్-2024 సాంకేతిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో లైవ్ డిప్లమో ప్రాజెక్టులు, సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణల సాంకేతిక ప్రదర్శన టెక్‌వేవ్-2024ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కమలాపురం పట్టణంలో మొదటి సారిగా ఇలాంటి ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఉపయోగించుకుని డిప్లమో విద్యపైన అవగాహన పెంచుకోవాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాంకేతిక ప్రదర్శన సందర్శించాల్సిందిగా ప్రిన్సిపాల్ తెలిపారు. మంచి ప్రతిభ కనబరిచిన ప్రాజక్టులకు బహుమతులు అందజేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

వల్లూరు : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను కడప డీఎస్పీ షరీఫ్ గురువారం పరిశీలించారు. మండలంలోని కొప్పోలు, తప్పెట్ల, పెద్దపుత్త, దుగ్గాయపల్లె, పైడికాలువ, దిగువపల్లె తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్రాల్లోని సౌకర్యాలను గురించి ఆరా తీశారు. అనంతరం పలు సూచనలు ఇచ్చారు. రాబోవు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, వల్లూరు ఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడేలా బడ్జెట్

వేంపల్లె : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడేలా ఉందని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.విజయభారతి తెలిపారు. గురువారం వేంపల్లెలో ఆమె మాట్లాడుతూ వికసిత్ భారత్‌కు మూల స్తంభాలైన మహిళలు, యువత, అన్నదాతల సాధికారిత కోసం బడ్జెట్ దోహదపడుతుందన్నారు. మధ్య తరగతి ప్రజలకు ఉపయోపడేలా బడ్జెట్ ఉందన్నారు.

ఏ రాష్ట్రంలో లేనివిధంగా పథకాలు


కోట్లూరులో ఇంటింటి ప్రచారంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, పార్టీ నేతలు

వల్లూరు : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అర్హత గల ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కోట్లూరు, చింతలపత్తూరు, కోట్లూరు ఎస్సీ కాలనీలలో గురువారం కరపత్రాలను అందచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను ఆరాతీశారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలన్నీ కొనసాగాలంటే జగన్ తిరిగి సీఎం కావాల్సిన అవసరం వుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, పార్టీ నేతలు నాగిరెడ్డి, మస్తాన్, వెంకటసుబ్బారెడ్డి, పుల్లయ్య, సుధాకర్‌రెడ్డి, నత్తర్ వలీ, మహబూబ్ బాషా, రఘు, బాబు, బుజ్జి, సురేష్, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు ప్రారంభం


సంతకొవ్వూరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మధురెడ్డి, తదితరులు

తొండూరు : మండలంలోని సంతకొవ్వూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ సముదాయాలతోపాటు విలేజ్ క్లినిక్ లను గురువారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వారికి ఘనస్వాగతం పలికారు. ముందుగా రూ.1.80 కోట్లతో నిర్మించిన ఆసుపత్రి, రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.35లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.16లక్షలతో నిర్మించిన పాల కేంద్రం, రూ.38లక్షలతో నిర్మించిన చర్చిలను స్థానిక సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ ఓబులేసులతో కలిసి వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కూడా చర్చిలను, ఆసుపత్రి భవనాలను పట్టణ స్థాయిలో నిర్మించడం అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శశికాంత్‌రెడ్డి, రమణారెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల రైతు సంఘం నాయకుడు వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ బండి లక్ష్మీనారాయణమ్మ, మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, గంగిరెడ్డి, గంగరాజు, ముకుందారెడ్డి, బాల గంగిరెడ్డి, నాగభూషణరెడ్డి, చంద్ర శేఖరరెడ్డి, మునేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణకు అందుబాటులో చికిత్సలు

ఎర్రగుంట్ల : కుష్టు వ్యాధి నివారణకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స అందబాటులో ఉందని జిల్లా లెప్రసి టీబీ అధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. గురువారం మండల పరిధి చిలంకూరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో జాతీయ కుష్టు వ్యాధి నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. శరీరంపై స్పర్శలేని పొడలు, రాగిరంగు మచ్చలు, తిమ్మిర్లు, కాళ్లు చేతులు నరాల బలహీనత ఉండటం కుష్టు వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆలస్యం చేస్తే అంగవైకల్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కుష్టు వ్యాధి నివారణ అధికారి వీరబద్రయ్య, పీహెచ్‌సీ డాక్టర్ సాయి చరితరెడ్డి, గణేషరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ నాగముని రెడ్డి, సూపర్‌వైజర్ సుబద్ర, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు ఘనసత్కారం


స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను సన్మానిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : పులివెందుల సీఎంవోలో పనిచేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్‌రెడ్డిని గురువారం పాడా కార్యాలయంలో ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

బదిలీల్లో భాగంగా రాంభూపాల్‌రెడ్డి పెన్నఅహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏవో రామాంజనేయ రెడ్డి, అకౌంట్ ఆఫీసర్ నీలకంఠారెడ్డి, సూపరింటెండెంట్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం


వెంకటాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, భైరవ ట్రాన్స్ పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని యు.వెంకటాపురం, ఎస్.పాలగిరి సచివాలయ పరిధిలోని నేలతిమ్మాయపల్లె, ఓబుల్‌రెడ్డి, మర్రిపల్లె గ్రామాల్లో వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించేటటువంటి జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని అంతే కాకుండా రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో గడ్డంవారిపల్లె సహకారం సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు వైస్ ప్రెసిడెంటు రామచంద్రారెడ్డి, గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, గంగయ్య, సాంభశివారెడ్డి, విశ్వనాథ్, ఇంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, వీరయ్య యాదవ్, విజయ్‌కుమార్ యాదవ్, ప్రతాప్ యాదవ్, శ్రీనివాసుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఒలంపియాడ్‌లో విద్యార్థి ప్రతిభ

పులివెందుల టౌన్ : యూనిఫైడ్ కౌన్సిలర్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ వారి ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్ 3వ తేదీన ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ ఫలితాలలో పులివెందుల శ్రీవిద్యాధరి ఇంగ్లీషు ఉన్నత మీడియం పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఆరిజ్ హుస్సేన్ ఆలిండియా 5వ ర్యాంక్ సాధించి తన సత్తా చాటాడు. దీంతో ఆ విద్యార్థి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌తోపాటు రూ.1000ల చెక్కు, ఇంగ్లీషు ఆన్‌లైన్ కోర్సు, ఫ్రీ సబ్‌స్క్రిప్షన్ కార్డు, ఇంగ్లీషు ఒలంపియాడ్ రీసోర్స్ బుక్స్ అందుకున్నారు. తమ విద్యార్థి ప్రతిభపట్ల పాఠశాల సీఈఓ భానుప్రకాష్, కరస్పాండెంట్ నాగరాజు, ప్రిన్సిపల్ జాకీర్ హుస్సేన్ అభినందనలు తెలిపారు.

నూతన ఎంపీడీఓగా సాల్మన్

సింహాద్రిపురం : స్థానిక నూతన ఎంపీడీఓగా జె.సాల్మన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా రాప్తాడు మండలం నుంచి బదిలీపై వచ్చారు. అలాగే సింహాద్రిపురం మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహబూబ్‌బాషా అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లారు.

లింగాల ఎంపీడీఓగా తేజోష్ణ

లింగాల : అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న తేజోష్ణ లింగాల ఎంపీడీఓగా గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. తన విధులను సక్రమంగా నిర్వహిస్తానని ఆమె అన్నారు.

వల్లూరు ఎంపీడీవోగా విజయభాస్కర్

వల్లూరు : స్థానిక ఎంపీడీవోగా విజయభాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న జయశ్రీని ఉన్నతాధికారులు కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నె మండల ఎంపీడీవోగా పని చేస్తున్న విజయభాస్కర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందనలు

పులివెందుల టౌన్ : గతనెల 24వ తేదీనుంచి 31వ తేదీవరకు కర్ణాటక రాష్ట్రంలోని హోసదుర్గలోని పాల్‌టెక్నిక్ కళాశాలలో జాతీయ సమైక్యతా శిబిరం జరిగింది. ఇందులో యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆదేశాల మేరకు పులివెందుల లయోలా డిగ్రీ కళాశాల (వైఎస్ఆర్ఆర్) ఎన్ఎస్ఎస్ వలంటీర్లు డి.దీప, శేషాద్రి, శ్రీవెన్నెల, ప్రదీప్‌లు పాల్గొని కళాశాలకు మంచి పేరు తీసుకరావడం జరిగింది. శిబిరంలో పాల్గొని తిరిగి వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ అభినందనలు తెలిపి వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.శంకరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని వదిలి వెళ్లం


వడ్డెర కులస్తులతో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల : పట్టణంలోని అహోబిలాపురంకు చెందిన వడ్డెర కులస్తులు వైఎస్సార్‌సీపీని వదిలి వెళ్లే ప్రసక్తేలేదని తేల్చిచెప్పడంతో టీడీపీ నాయకులు కంగుతిన్నారు. బుధవారం వడ్డెర కులస్తులు టీడీపీలో చేరినట్లు కండువాలు కప్పారని.. టీడీపీలో చేరారని ఆ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని తెలిపారు. గురువారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్‌ల ఆధ్వర్యంలో తాము వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నామని వడ్డెర కులస్తులు తేల్చి చెప్పారు. టీడీపీలో చేరినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సరికాదన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


కొత్తగంగిరెడ్డిపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మండల కన్వీనర్ చంద్రారెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాలంటే మళ్లీ జగనన్ననే సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని ఇసుకపల్లె, కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీల్లో రెండు టీమ్‌లుగా ఏర్పడి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్ రెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నివారణకు చర్యలు

వేంపల్లె : పంచాయతీ పరిధిలోని పారిశుధ్య నివారణకు చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎస్సీ కాలనీల్లోని డ్రైనేజీలో జేసీబీతో పూడిక తీత పనులు చేపట్టారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రాని వారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వివిధ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : వివిధ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి మొదటి బహుమతి సాధించినట్లు శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జనవరి 30వ తేదీన పులివెందులలోని లయోలా డిగ్రీ కళాశాలలో యునైటెడ్ స్కూలు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఓ) ఆధ్వర్యంలో ఇంటర్ స్కూలు ఫెస్ట్-2024 నిర్వహించిన ఐదు రకాల పోటీల్లో డ్యాన్స్, స్పాట్ పెయింటింగ్ విభాగాలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపినట్లు వెల్లడించారు. డ్యాన్స్ విభాగంలో హేమెంద్రి, మిధునప్రియ, జస్వితప్రియ, హర్షిణి, షణ్ముఖప్రియ, స్పాట్ పెయింటింగ్ విభాగంలో రోహిత్‌లు మొదటి బహుమతులు సాధించారు. శిక్షణ ఇచ్చిన డ్యాన్స్, డ్రాయింగ్ మాస్టర్లను, విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకోవాలి

పులివెందుల రూరల్ : వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ప్రజలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికలలో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐలు హుస్సేన్, అరుణ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులు భవితకు మార్గదర్శకాలు

ఎర్రగుంట్ల : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులు గురువారం ఐటీఐ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్, ఎలక్ట్రానిక్ కోర్సులను అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఇండస్ట్రియల్ ఫీల్డ్ విజిట్ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్య శిక్షకులు తేజదీప్, జనార్థన్, ప్రభుకుమార్, ఈశ్వరయ్యలు పాల్గొన్నారు. అలాగే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో పరిశుభ్రత చర్యలు చేపట్టినట్లు హెచ్ఎం తెలిపారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని మళ్ళీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ మాసీమబాబులు ప్రజలను కోరారు. గురువారం 8వ వార్డు (శివాలయం వీధి)లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలతో ఆ ఇంటికి జరిగిన మేలును వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీకి ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, మాజీ సొసైటీ అధ్యక్షుడు రవిరెడ్డి, సీనియర్ నాయకులు జగన్నాథం, నీలం వెంకటసుబ్బారెడ్డి, టీఎన్ చంద్రరెడ్డి, వారీష్, హజ్రత్, అబ్దుల్ రబ్, కరీం, జుమన్, గుమ్మల మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు సిద్దిగారి వెంకటసుబ్బయ్య, తుంగ చంద్రశేఖర్‌యాదవ్, నీలం శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ పిచ్చయ్య, సోషల్ మీడియా సత్య, ఎంపీటీసీలు ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, ఆరవేటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ స్థాయి సెమినార్


మాట్లాడుతున్న ఐఐపీఎం డైరెక్టర్ విజయ్‌కుమార్

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో గురువారం బెంగళూరు ఐఐపీఎం, పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల సంయుక్తంగా "మిల్లెట్స్: పర్యావరణ పునరుజ్జీవం మరియు ఆరోగ్యానికి వివిధ విధానాలు" అనే అంశంపై రెండు రోజులపాటు జాతీయస్థాయి సెమినార్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఐపీఎం డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్, వైవీయూ బయెటెక్నాలజీ అధ్యాపకులు చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎల్‌బీఐ ఇన్‌చార్జి నజ్మా, సెమినార్ కన్వీనర్ డాక్టర్ నబీ రసూల్, అధ్యాపకులు కీర్తిరెడ్డి, రాజేష్, నివేదిత, సాయిశ్రీనివాస్, రాజశేఖర్, ప్రవీణ్, పావన దీప్తి, సుబ్బారెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రామనపల్లెలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు

చెన్నూరు : కడపలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రామనపల్లెలో గురువారం నుంచి ఏడు రోజులు ప్రత్యేక శిబిరంను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీం బాషా తెలిపారు. తొలుత యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి జాతీయ సేవా సమితి సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎన్ఎస్ఎస్ యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు. ఇటీవల కోటిరెడ్డి కళాశాల వలంటీర్లు కర్ణాటకలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్నారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.విజయలక్ష్మిదేవి పాల్గొన్నారు.